## మినీకథ

# కక్కుర్తి

కొండముది శ్రీరామచంద్రమూర్తి

పెద్ద పోస్టాఫీసులో సాయంకాలం ఐదు దాటిం తర్వాత పని చేసే కౌంటర్ దగ్గర వాహబే రద్దీగా వుంది. ఎవరి తొందర వారిది. కౌంటర్ వెనకాల కూచున్న గుమాస్తా మొహంలో చిరాకు అతనే కవర్లు తూయాలి. ఎన్ని స్టాంపులంటించాలో చెప్పాలి. డబ్బులు తీసుకుని స్టాంపులీయాలి రిజిష్టర్డు ఆర్టికల్స్‌కు రసీదులు రాయాలి. ముద్దర్లు వేయాలి. మనియార్డర్లు బుక్ చేసుకోవాలి. మిగిలిన సవాలక్ష సంగతులు చూసుకోవాలి. సింగిల్ క్లర్కు బానిస రాజ్యం అది.

అతను మాటి మాటికీ తలెత్తి. కౌంటరులో నుంచి బయటికి చూస్తూ. "నో ఛేంజ్! నో ఛేంజ్ ప్లీజ్ : ఛేంజ్ తెచ్చుకోండి. ఛేంజుంటేనే ఇక్కడ ట్రాన్సాక్షన్!" అంటు న్నాడు. అయిదు పైసలూ. పది పైసలూ రావలసిన వాళ్ళు చిల్లర వదులుకుంటు న్నారు ఉదారంగా. ఇంకా పైన రావలసి వాళ్లు కౌంటరును అంటిపెట్టుకుని తమఛాన్స్ కోసం వెయిట్ చేస్తున్నారు.

క్రిష్ణారావు ఎట్లాగైతేనేం చెయ్యిలోపలకు పెట్టాడు. కవరూ. పది రూపాయలూ గుమాస్తా కందించగలిగాడు. క్రిష్ణారావుతో పాటుగా మరో ముగ్గురు కూడా తమ చేతుల్ని లోపలకుపెట్టారు. ఒకరి చేతిలో ఇరవై రూపాయల నోటు. ఇంకొకరి చేతిలో అయిదు రూపాయల నోటు. మరొకరి చేతిలో రెండు రూపాయల నోటూ వున్నాయి. ముగ్గురి చేతుల్లోనూ మూడు కవర్లు

"నో. నో. నో ఛేంజ్ !" పోస్టలు క్లర్కు రికార్డు వేశాడు

"ముందు ఎంతయిందో చూడండి. స్టాంపులియ్యండి ఆ తర్వాత చిల్లర సంగతి చూదొచ్చు!" ఆ గుమాస్తా కళ్ళు మిలమిల లాడాయి. చేతులు చకచక పనిచేశాయి. అతను కృష్ణమూర్తి చేతిలో వో అయిదు రూపాయల నోటు పెట్టాడు. అతని మొహమైనా చూడకుండానే— నలుగురి కవర్లూ వొకేసారి తీసుకుని. వాటిని వొకదానివెంట మరొకటిగా వెంటవెంటనే తూసేసి. ఎంత దరకు స్టాంపులు అంటించాలో చెబుతూ. స్టాంపుల పట్టీలోనుంచి కావలసినది చింపి వాళ్ళకు ఇచ్చేశాడు. కవర్లతో సహా. ఆ నలుగురూ కొంచెం ఇవతలకువచ్చి నిలబడి నాలికతో స్టాంపుల్ని తడి చేస్తూ. తడి స్టాంపుల్ని కవర్లకు అంటించటం మొదలు పెట్టాడు.

స్టాంపు లంటించిన కవరు తీసుకుని క్రిష్ణమూర్తి కౌంటరు దగ్గరకు చేరుకునే సరికే అక్కడ రద్దీ మరింత ఎక్కువైనట్లుంది. కౌంటరులోకి చెయ్యి దూర్చడమే కష్టం అయింది. తన ముందుకు వచ్చిన స్టాంపు లంటించిన కవరును ఆ గుమాస్తా రిజిష్టరు చేసుకుని "ఎంతిచ్చారూ?" అన్నాడు యంత్రవత్‌గా.

"పదిచ్చాను!"

"నలభై పైసలియ్యండి. ఆరు రూపాయలిస్తాను!"

"లేవు."

"నాలుగూ నలభై రిజిష్ట్రీ. ఇదిగో అయిదు రూపాయల నోటు. అరవై పైసలు వస్తాయి ఇంకా మీకు !"

క్రిష్ణమూర్తి గభాలున ఆ అయిదు రూపాయల నోటు లాక్కున్నాడు. అరవై పైసలూ నాలుగు కార్డు లియ్యండి" అంటూ వాటిని తీసుకుని గబగబా పోస్టాఫీసులో నుంచి బయటకు వచ్చేశాడు.



బయట కృష్ణమూర్తి భార్య రాధామణి వెస్పా పక్కన నిలబడి వుంది. దుమ్మును తిట్టుకుంటూ దోమలను తోలుకుంటూ భర్తను చూడగానే కొంచెం విసుగ్గా "కవరు పోస్టు చేయడానికి ఇంత సేపా? అవతల సినిమా మొదలుపెట్టేయరూ?" అన్నది.

"లోపలకు వస్తే తెలుస్తుంది ఇదో ఫిష్ మార్కెట్టు" అంటూ క్రిష్ణమూర్తి వెస్పాను స్టార్ట్ చేశాడు ఆ చేపల మార్కెట్లులోనే తన వల్లో ఓ చేప పడిందన్న సంగతి అతనికి లోపల గిలిగింతలుగా వుంది జనం రద్దీ పోస్టలు క్లర్కు మతిమరుపూ తనకెట్లా లాభించాయో భార్యతో చెప్పుకోవాలని క్రిష్ణమూర్తికి మహ ఇదిగావుంది. కానీ అంతావిని "అయిదు రూపాయలకు ఆ కక్కుర్తి ఎందుకంటీ ?" అంటుందని భయపడి చెప్పడం మానేశాడు.

తనది అయిదు రూపాయలకు కక్కుర్తి అయితే. ఆ పోస్టలు గుమస్తాది అయిదు పైసల. పదిపైసల కక్కుర్తి. ఈ లోకంలో ఏ మగవాడి కక్కుర్తి ఆ మగవాడిది—అనుకున్నాడు.

క్రిష్ణమూర్తినీ. రాధామణినీ ఎక్కించుకుని బయలుదేరిన వెస్పా ఓవర్ బ్రిడ్జి ఎక్కబోతూ ఠక్కుని ఆగిపోయింది. క్రిష్ణమూర్తి దాన్ని కొంచెం సేపు లాలించాడు. కిక్ కొట్టీ కొట్టీ అలసిపోయాడు. అతని నుదురు చెమట పట్టింది. జుట్టు చెదరి పోయింది.

"రాధా! నువ్వు ముందు రిక్షామీద వెళ్ళు. టిక్కట్లు తీసుకో. నేను దీన్ని మెకానిక్ దగ్గరకు తీసుకువెళ్ళి. రిపేర్ చేయించొస్తాను."

"రిక్షావాడు మూడో నాలుగో అడుగుతాడండీ!" అన్నది రాధామణి.

"చేసేదేముందీ - ఇంత దూరం వచ్చి మధ్యలో మానుకుంటే లాభం గూబల్లో కొస్తుంది."

"మహా ఇప్పుడు రానట్టూ?" రాధారాణి మూతి మూడు వంకర్లు తిప్పి. "తొందరగా రండి" అంటూ హెచ్చరికలు పలికి. ఓ రిక్షాను కేకేసి వాడడిగినంతకూ మనసులోనే తిట్టుకుంటూ వొప్పుకుని. సినిమా హాలు వైపుగా తరలివెళ్ళింది.

క్రిష్ణమూర్తి వెస్పాను నడిపించుకుంటూ చెమటలు కక్కుకుంటూ. ఓ రిపేరు షెడ్డు చేరాడు. మెకానిక్ అతన్ని సాదరంగా ఆహ్వానించాడు.

"ఏమిటి సార్ ట్రబుల్?"

"ఏమిటోనయ్యా. నడుస్తు నడుస్తూ దారిలో సడన్‌గా ఆగిపోయింది!"

ఆ మెకానిక్ దొప్పతీసి పక్కన పెట్టాడు. ప్లగ్ తీసి క్లీన్ చేశాడు ఓవర్ అయిన ఆయిల్‌ని "డ్రై" చేశాడు. బండిని స్టార్ట్ చేసి క్రిష్ణమూర్తి ముందు పెట్టాడు.

"థ్యాంక్యూ! ఎంతియ్యమంటావ్?"

"ఓ టెన్ ఇప్పించండి!"

"ఏమిటి ఈ మాత్రం పనికి పది రూపాయలా?" క్రిష్ణమూర్తి మొహం తెల్లబడింది.

"పది రూపాయలకు ఏం వస్తున్నది సార్? ఓ బీరు బాటిల్ రాదు :"

ఒక్క రూపాయి నజరానాగా ఇద్దామనుకున్న క్రిష్ణమూర్తి. పదిరూపాయలూ సమర్పించి వెస్పాను తీసుకుని రోడ్డెక్కాడు వెనగ్గా అతనికి షెడ్డులోనుంచి మాటలు వినబడుతున్నాయి.

"నీ కక్కుర్తి కూడా! ఎందుకురా ఆయన్ని అట్టా పిండాక?"

"వొరేయ్! మన టైం వొచ్చింది మనం పిండాము. ఆయన టైం వొస్తే ఆయన పిండుతాడు. ఎవుడి కక్కుర్తీ. ఎవుడి టైమూ ఆడిపి!"